# ఆహ్లాదకరం.. పల్లె ప్రకృతివనాలు..



రాజుగూడ పల్లె ప్రకృతి వనం



నాగసముద్రంలో..

దండేపల్లి, డిసెంబర్15 : పల్లె అంటేనే ప్రకృతికి నిలయం..ఇక్కడ ప్రకృతి సౌందర్యాలు అనంతం....ఆ ప్రకృతికి, సహజత్వానికి మరింత శోభనిచ్చేలా పల్లెల్లో ప్రకృతి వనాల నిర్మాణాలను మూడేళ్ల క్రితం కేసీఆర్ సర్కారు చేపట్టింది. గతంలో పట్టణాలు, నగరాలకే పరిమితమైన పార్కులు నేడు పల్లెల్లో కనువిందు చేస్తున్నాయి. ఈ వనాల్లో ఆహ్లాదాన్ని నింపేలా, సేద తీరేలా అన్ని రకాల పూలు, పండ్ల మొక్కలు, నీడనిచ్చే భారీ వృక్షాలు, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించే వృక్షాలు పెంచారు. ఇందుకు గ్రామీణ ఉపాధిహామీ నిధులు వినియోగించారు. ప్రతి గ్రామంలో ఎకరం విస్తీర్ణానికి మించకుండా ప్రకృతి వనాలను ఏర్పాటు చేయడం వల్ల గ్రామాలు నూతన శోభను సంతరించుకున్నాయి. దీంతో ఆహ్లాదానికి కేరాఫ్‌గా నిలుస్తున్నాయి.

**మండలంలో 53 పల్లె ప్రకృతి వనాలు...**

దండేపల్లి మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా 53 ప్రకృతి వనాలను నిర్మించారు. ఒక్కో ప్రకృతి వనంలో సుమారు 4 వేల వరకు మొక్కలు నాటడంతో అవి నేడు పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. నడకదారి(వాకింగ్ ట్రాక్) ఏర్పాటుచేసి, సందర్శకులు సేదదీరేందుకు అక్కడక్కడ సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు. ఉపాధిహామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన వనాలకు సుమారు రూ. 6.47 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇందులో రూ.3,43,282 కూలీల ఖర్చు కాగా, మరో రూ.3,04,273 మెటీరియల్‌కు వెచ్చించారు.



తాళ్ల పేటలో ప్రకృతివనం

**ప్రకృతి వనంలో మొక్కలు...**

ప్రకృతి వనాల్లో సందర్శకులకు నీడనిచ్చే మొక్కలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు.ఇందులో భాగంగా వేప, చింత, జామ, రావి,కానుగ మొక్కలతో పాటు దానిమ్మ, సీతాఫలం, నిమ్మ, ఉసిరి, వంటి మొక్కలను నాటారు.అవి ఇప్పుడు పెరిగి పండ్లు ఇస్తున్నాయి.సందర్శకులను ఆకట్టుకునేందుకు వివిధ రకాల పూల మొక్కలు కూడా ఏపుగా పెరిగాయి. పిల్లలు ఆడుకునేందుకు ఆటబొమ్మలు, జారుడు బల్లలు ఏర్పాటు చేశారు.

# సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలి

- లక్షెట్టిపేట ఎస్ఐ లక్ష్మణ్
- ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్


సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ లక్ష్మణ్


ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

లక్షెట్టిపేట, డిసెంబర్15: మారుతున్న కాలానికనుగుణంగా విద్యార్థులు తమ మేధస్సుకు పదునుపెట్టి సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని ఎస్ఐ లక్ష్మణ్ అన్నారు. పట్టణంలోని ట్రినిటీ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలు తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంతో కష్టపడి వివిధ రకాల ఎగ్జిబిట్లను ప్రదర్శించి, వారి నైపుణ్యతను ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. సైన్స్‌ఫెయిర్ కార్యక్రమంలో 900 మంది విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏవీ జోసెఫ్, డైరెక్టర్లు డోన్ డొమినిక్, వైస్ ప్రిన్సిపాల్ రాహుల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ కాంటిజెంట్ లీడర్‌గా షరీనాబేగం


షరీనా బేగం


స్రవంతి

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 15: కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం వలంటీర్లకు అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంపునకు తెలంగాణ నుంచి కాంటిజెంట్ లీడర్‌గా మంచిర్యాల పట్టణానికి చెందిన వివేకవర్ధిని డిగ్రీ కళాశాల ప్రోగ్రాం అధికారి షరీనాబేగం ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి వివిధ యూనివర్సిటీలకు చెందిన 20 మంది వలంటీర్లు ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ధర్మశాలలో అటల్ బీహార్ వాజ్‌పేయ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్, అలైడ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే 10 రోజుల అడ్వెంచర్ క్యాంపులో వీరు పాల్గొనున్నారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి వలంటీర్‌గా వివేకవర్ధిని డిగ్రీ పీజీ కళాశాలలో బీకాం మూడో సంవత్సరం చదువుతున్న స్రవంతి కూడా ఎంపికైంది. కాంటిజెంట్ లీడర్‌గా ఎంపికైనా షరీనాబేగం, వలంటీర్‌గా ఎంపికైన స్రవంతిని కళాశాల చైర్మన్ గోనె శ్యామ్‌సుందర్‌రావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జాతీయ సేవా పథకం జిల్లా కన్వీనర్ డాక్టర్ చంద్రమోహన్ గౌడ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. తనపై నమ్మకంతో కాంటిజెంట్ లీడర్‌గా ఎంపిక చేసిన కాకతీయ యూనివర్సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఈసం నారాయణ, జిల్లా కన్వీనర్ చంద్రమోహన్ గౌడ్‌కు షరీనా బేగం కృతజ్ఞతలు తెలిపారు.

## నిబంధనలు పాటించేలా చూడాలి

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 15 : నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని మంచిర్యాల ఎంఈవో జాడి పోచయ్యకు తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చల్లి ప్రవీణ్ కుమార్ శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించకుండా నడిపిస్తున్నారని, ఎలాంటి అనుమతులు లేకుండా హాస్టళ్లు నిర్వహిస్తున్నారని అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## రైతులకు పాస్ఫరస్ సొల్యుబిలైజింగ్ బ్యాక్టీరియాపై అవగాహన


జన్నారంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సంగీత

జన్నారం, డిసెంబర్ 15 : జన్నారం మండల కేంద్రంలోని పొనకల్ రైతు వేదికలో మండల ఏవో సంగీత ఆధ్వర్యంలో రైతులకు పాస్ఫరస్ సొల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా వాడకంపై అవగాహన కల్పించారు. బ్యాక్టీరియాను ఇసుక, పశువుల ఎరువులో కలుపుకొని వరి నాటు సమయంలో 10 నుంచి 20 నిమిషాల పాటు బ్యాక్టీరియా మిశ్రమంలో ఉంచి నాటువేస్తే బ్యాక్టీరియా భూమిలోకి వెళ్లి మొక్కకు అందని భాస్వరాన్ని కరిగించి అందజేస్తుందని తెలిపారు. ఈ బ్యాక్టీరియాను వాడితే డీఏపీ వాడాల్సిన అవసరం ఉండదని దీంతో రైతులకు పెట్టుబడి తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో త్రిసంధ్య, పొనకల్ సెక్టర్ రైతులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాసం

- కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన కౌన్సిలర్లు

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 15: మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్‌చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్‌లపై మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. మంచిర్యాల మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో 26 మంది సంతకాలు చేసిన నోటీసు కాపీని శుక్రవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు అందజేశారు. తాము ఇచ్చిన అవిశ్వాస తీర్మాణాన్ని ఆమోదించి కొత్తవారిని ఎన్నుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అవిశ్వాస తీర్మాణం అందించిన వారిలో ఉప్పలయ్యతోపాటు కౌన్సిలర్లు బుద్ధార్తి సత్తమ్మ, సల్ల మహేశ్, మజీద్, ప్రకాశ్‌నాయక్, బొలిశెట్టి సునీత, ఆసంపల్లి లావణ్య, గోగుల శ్రీలత, సల్ల తార, నల్ల శంకర్, పోరెడ్డి రాజయ్య, పూదరి సునీత, వంగపల్లి అనిత, కొండ పద్మ, మేరుగు మహేశ్వరి, రామగిరి భానేశ్, వేములపల్లి సంజీవ్, ఎండి మినాజ్, నాంపల్లి మాధవి, సిరికొండ పద్మ, పల్లపు సాయిభార్గవి, చైతన్యరెడ్డి, రావుల ఉప్పలయ్య, సురేశ్‌బల్దవా, జగ్గారి సుమతి, మాదంశెట్టి సత్యనారాయణ, అఫ్రిన్‌సుల్తానా ఉన్నారు.

## క్యాంపునకు తరలిన కౌన్సిలర్లు

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 15: మంచిర్యాల మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లారు. శుక్రవారం రాత్రి వీరంతా మంచిర్యాల నుంచి హైదరాబాద్ శివారులోని రిసార్ట్‌కు ఆర్టీసీ ఏసీ బస్‌లో బయలుదేరారు. శనివారం ఎమ్మెల్యే పీఎస్సార్‌ను కలిసి అక్కడినుంచి క్యాంపులోకి వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధంచేశారు. మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన రోజే 26మంది కౌన్సిలర్లు వారి కుటుంబ సభ్యులతో కలిసి క్యాంపునకు తరలివెళ్లారు.

## నియామకం


రూప్లానాయక్


బానోత్ ప్రకాశ్

దండేపల్లి, డిసెంబర్ 15 : తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం(టీజీయూఎస్) రాష్ట్ర ఆదేశానుసారం మంచిర్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా భుక్యా రూప్లానాయక్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ ప్రకాశ్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే జిల్లా, మండలాల కార్యవర్గాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికైన వారు రెండేళ్లు పదవిలో కొనసాగుతారని తెలిపారు.

## గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

హాజీపూర్ డిసెంబరు 15: నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ బ్యాంక్ సేవక్స్, ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ ఇచ్చి పిలుపు మేరకు గ్రామీణ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని దోనబండ పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ఎదుట తపాల ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. సమ్మెలో ఉద్యోగులు రజినీ, సంధ్య, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్, భూమయ్య, శంకరయ్య, అశోక్, భాషమియా, తదితరులున్నారు.

## ఓడినా..గెలిచినా ప్రజలతో ఉంటా..

- బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఖానాపూర్ నియోజకవర్గ భూక్యా జాన్సన్‌నాయక్


మాట్లాడుతున్న భూక్యా జాన్సన్‌నాయక్

జన్నారం, డిసెంబర్ 15 : ఓడినా గెలిచినా ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవచేస్తానని బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గెలుపోటములు సహజమేనని, ప్రజల కష్టాలను తీర్చే నాయకులను ప్రజలు ఎప్పటికైనా అదరిస్తారని తెలిపారు. అధైర్య పడకుండా ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన, మార్కెట్ కమిటీ చైర్మన్ సీపతి బుచ్చన్న, సీపతి అనందం, కేప నర్సిహులు, సులువ జనార్దన్, అడేపు లక్ష్మీనారాయణ, జెల్లా భీమయ్య, రాజేశ్వర్, మున్వర్‌అలీఖాన్,సీహెచ్ సత్యం, బీఆర్ఎస్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు,